కాలచక్రం

మల్లాడి శ్యామలారాణి

"వంకాయలు కిలో ఎంత ?" అన్నాడు రామారావు.

"పదిరూపాయలు" అంది కాయగూరలమ్మి.

"అయ్య బాబోయ్ ! వంకాయలు వద్దుగాని బెండకాయలు కావాలి, ఎలాగమ్మ" అన్నాడు రామారావు.

"పన్నెండు రూపాయలు చేసుకోండి" అంది.

"ఏమిటి, పన్నెండు రూపాయాలా ! వద్దుగాని బంగాళా దుంపలు ..."

ఒక నిర్లక్ష్యమైన చూపు రామారావు వైపు చూసి 'కాయగూరలు తినే ముఖంలా లేదు' అని క్రొత్తగా వచ్చిన వ్యక్తివైపు చూసి – "మీకేం కావాలో చెప్పండయ్యా" అంది.

రామారావుకి ఆ అమ్మి అలా అన్నందుకు బాధ అనిపించలేదు గాని, ధరలు అలా పెరిగిపోయినందుకు మతిపోయింది. రకరకాల ఆలోచనలతో ఉన్న రామారావు శరీరంలో ఒక్కసారి నిస్సత్తువ చోటు చేసుకొంది. ఇక నడువలేక దగ్గరలో ఉన్న బస్ స్టాప్‌కు వెళ్లి నిలబడ్డాడు.

కంట్లో ఏదో నలక పడడంతో చేత్తో కన్ను రుద్దుకుంటూ చూశాడు. పెద్ద చప్పుడు రోడ్ రోలరులాగ చేసుకొంటూ, వంటింట్లో కట్టెలపొగ గొట్టంలోంచి పొగ వచ్చినట్లుగా, దట్టమైన పొగతో, చుట్టూ కటకటాలు, పైన టాపుతో బొగ్గుతో నడిచే బస్సువచ్చి ఆగింది.

"ఓహో ! దీని మహిమా !" అని బస్సు దగ్గరకు వచ్చాడు రామారావు.

కిక్కిరిసిన మనుష్యులతో బస్సు ఆగినట్లే ఆగి, దిగేవారు ఎవరూ లేకపోవడంతో దడదడమని శబ్దం చేస్తూ వెళ్లిపోయింది.

నిస్పృహగా వెళ్లిన బస్సువైపు చూశాడు. మరో రెండు బస్సులు వచ్చి మొదటి బస్సు పద్ధతినే ఫాలో అవుతున్నట్లుగా వెళ్లిపోయాయి.

కాళ్ళు పీకసాగాయి రామారావుకి. చేతిలోని సంచిని రెండవ చేతిలోకి మార్చుకొని, 'అనవసరంగా నిలబడ్డాను. నడచిపోవాల్సింది' అనుకుంటున్నంతలో మరొక బస్సు వచ్చి ఆగింది.

గభాలున ఫుట్‌పాత్‌మీదకు ఎక్కి రాడ్ పట్టుకున్నాడు రామారావు.

నిండుచూలాలు భారంగా అడుగులు వేస్తున్నట్లుగా నెమ్మదిగా వెళ్లసాగింది బస్సు.

"ఇదే ఆయిల్ బస్సు అయితే తను దిగవలసిన స్టాప్ అయిదు నిమిషాల్లో వచ్చేది. అనవసరంగా ఎక్కాను" అని నిట్టూర్చాడు.

ఎలాగైతేనేం ఇల్లు చేరుకున్నాడు రామారావు. కంచంముందు కూర్చుని ఖరీదులు ఎలా పెరిగి పోయాయో చెప్పసాగాడు లక్ష్మితో.

కంచంలో అన్నం వడ్డించి నీళ్లో, మజ్జిగో తెలియని మజ్జిగగిన్ని, కంచందగ్గర పెట్టింది లక్ష్మి.

మజ్జిగ కంచంలో పోసుకుంటూ, "ఏమిటి లక్ష్మి... కనీసం మజ్జిగవాసనైనా లేకుండా ఇంత పలచన చేశావు" అన్నాడు.

"బాగుందండీ మీ వరుస... నేనేమైనా మీకోసం ప్రత్యేకించి నీళ్లు ఎక్కువ కలిపానంటారా? అరలీటరు పాలు పోయించుకుంటున్నాము. ఇంటందరిము సర్దుకోవాలాయే" అంది.

అవునుకదూ ! అంటూ చప్పన భోజనం ముగించి కంచం ముందునుంచి లేచాడు రామారావు.

* * *

తెల్లవారింది. కాలకృత్యాలు ముగించుకొని, పేపరు హెడ్‌లైన్సు చూడసాగాడు రామారావు.

ఆకలి చావులు, పొలాల్లో పంటలు దోచుకు పోవడం, లూటీలు... దోపిడీలు, హత్యలు ఎక్కడ చూసినా అంతకుమించి వార్తలు కనిపించలేదు.

ఇంతలో పోస్టుమేన్ టెలిగ్రాం తీసుకు రావడంతో కంగారుగా టెలిగ్రాం అందుకొని చదివాడు.

"లక్ష్మి ! అల్లుడు దగ్గరనుంచి టెలిగ్రాం వచ్చింది. కంగారేం పడకు. అమ్మాయి డెలివరీ కోసం మనని అర్జంటుగా రమ్మని ఇచ్చాడు. నేను ఆఫీసుకి వెళ్లి సెలవుపెట్టి వస్తాను. నువ్వు ప్రయాణానికి సిద్ధంగా ఉండు." అని రామారావు ఆఫీసుకి వెళ్లాడు.

రామారావు తిరిగి రాగానే వెంటనే ఇద్దరూ స్టేషన్‌కి బయలుదేరారు. రెడీగా ఉన్న ట్రైన్ ఎక్కారు ఆదరా బాదరాగ. ప్రయాణం అంతా కూతురికి ఎలా ఉందోనని కంగరు పడసాగింది లక్ష్మి.

దిగవలసిన ఊరు రావడంతో ట్రైన్ దిగి బస్ స్టాండ్‌కు వెళ్లారు. అక్కడికి నలభై మైళ్ల దూరంలోనే ఉన్న పల్లెటూర్లో అల్లుడు, కూతురు ఉంటున్నారు.

"తొందరగా వెళ్లి బస్సు టిక్కెట్లకి ప్రయత్నించండి. అలా చూస్తారేమిటి ! అవతల అమ్మాయి ఎలా ఉందో ఏమో !" అని కోపంగా అంటున్న భార్యవైపు చూసి టిక్కెట్ల కోసం బస్సు వద్దకు వెళ్లాడు రామారావు.

ఒక్కొక్క బస్సుకు టిక్కెట్ల కోసం ప్రయత్నించసాగాడు. మధ్యాహ్నం క్యూలో నిలబడ్డ వాడు ఎలాగైతేనేం సాయంకాలానికి బ్రతుకుజీవుడా అంటూ బట్టలు నలిగిపోయి, జుట్టు చెదిరి టిక్కెట్లు పట్టుకొని విజేతలా లక్ష్మి దగ్గరకు వచ్చాడు రామారావు.

ఇద్దరూ ఎలాగైతేనేం బస్సు ఎక్కారు.

సుత్తితో తల బ్రద్దలుకొడుతున్నట్లు దడదడ శబ్దంతో "అంతమంది ఒక్కసారి బస్సు ఎక్కుతారా? మీకు తగిన పనిష్మెంటు ఇస్తాను. పొగతో ఉక్కిరి బిక్కిరై ఏడవండి' అన్నట్లు దట్టమైన పొగ వదులుతూ బస్సు బయలుదేరింది.

రామారావుకు రాత్రంతా బస్సులో ఒళ్ళు హూనం అయినందుకు బాధ అనిపించలేదుగాని, సెలవు ఇచ్చిన రెండు రోజుల్లో ఒకరోజు ప్రయాణానికి అయిపోయినందుకు బాధ అనిపించింది.

బస్సుదిగి ఒళ్ళంతా మసితో కూతురి ఇంటికి వెళ్లారు. వీధి వరండాలో నిలబడి అటు ఇటు పచార్లు చేస్తున్నాడు అల్లుడు ప్రసాద్.

ఇంట్లోకి అడుగుపెడుతూనే లక్ష్మి "అమ్మాయి ఎలా ఉందో చెప్పు బాబు !" అంది కంగారుగా.

"మరేం కంగారు పడకండి అత్తగారూ ! అసలు నేనే నిర్మలను తీసుకువచ్చి మీ దగ్గర వదలుదామను కున్నాను. లీవు దొరకలేదు. బిడ్డ అడ్డంగా ఉందని, ఆపరేషన్ అవసరం ఉంటుందేమోనని ఇక్కడ డాక్టరు అంది. ఇది మరీ పల్లెటూరు. మీదగ్గరైతే బాగుంటుందని టెలిగ్రాం ఇచ్చాను" అన్నాడు ప్రసాద్.

రామారావు, లక్ష్మి మరునాడు నిర్మలతో తిరుగు ప్రయాణమయ్యారు. ప్రొద్దున్నే క్యూలో నిలబడ్డ రామారావు ఎలాగైతేనేం మధ్యాహ్నానికి టిక్కెట్లు సంపాదించాడు.

"మాయదారి జనం. ఎక్కడ చూసినా ఖాళీ ఉండదు" అని లక్ష్మి విసుక్కుంది.

బస్సు ఎక్కారు. లక్ష్మి "ఏమండోయ్ అలా తోసుకుంటూ బస్సు ఎక్కితే ఎలా ? నిండుచూలాలు మీద పడుతున్నారు. తరువాత బస్సులో రావచ్చు కదా" అంది చిరాకుగా ఒక పెద్దమనిషిని ఉద్దేశించి.

"బాగుందమ్మా సలహా, ఈ బస్సుకు వచ్చిచెడి టిక్కెట్టు తీసికొంటే ఇంకో బస్సులో వెళ్లాలా ?" అన్నాడు కోపంగా. "అయినా అసలు ఇంకా పిల్లల్ని కనమని ఎవరు చెప్పారు ? అసలే జనాభా ఎక్కువై ఛస్తుంటే" అని ఒక యువకుడు దెప్పిపొడిచాడు.

చేదు నిజాలు

ఆశల కడలిలో
ఊసులాడుకుంటున్నా
కోర్కెల జలధిలో
కొట్టుకుపోతున్నా
కలల వారాశిలో
తేలియాడుతున్నా
ఆలోచనా సాగరంలో
లోలోపల వెతుకుతున్నా
ఎందుకో తెలసా !
ఊహాలోకం విడిచిపెట్టి
వర్తమానం వెన్నుతట్టి
పరికించాలని ...
పరికిస్తే ... తిలకిస్తే ...
కానేకాదవి రంగుల హంగులు – అవి
కలచివేయు చేదు నిజాల పొంగులు

– వి.వి.ఎస్.బి. కుటుంబరావు

వాళ్ళకేం తెలుసు. నిర్మలకి తోటిమారు ఆడబిడ్డ. ఇది రెండవ కాన్పు అని.

"ఊరుకో అమ్మా... వాళ్ళతో వాదన ఎందుకు ?" అంది సిగ్గుగా నిర్మల.

మర్నాడు ఉదయం ఆఫీసుకి బయలుదేరాడు రామారావు.

"ఏమండీ ! వాడి గురించి ఏమైనా పట్టించుకుంటున్నారా ? రవికి పదేళ్ళు వచ్చేవరకు స్కూల్లో సీటు సంపాదించలేకపోయారు ! ఏదో ఐదు మైళ్ళ దూరంలో సీటు సంపాదించారంటే వాడికి పుస్తకం తెస్తానని చెప్పి ఇన్నాళ్ళు చేస్తారా ? అంత మతిమరుపైతే ఎలాగండి ? ఆమాత్రందానికి పెళ్లి ఎందుకు చేసుకొన్నారు ? పిల్లల్ని ఎందుకు..."

"లక్ష్మీ!" అసహనంగా అరిచాడు రామారావు.

"మన కనీస అవసరాలు తీరాలంటే నా జీతం చాలదు. లక్ష్మీ ! నాకొచ్చే జీతం లాంటిది రెండు జీతాలు కావాలి. నేను పుస్తకం మరచిపోలేదు. షాపుకి వెళ్లాను. ఒకటవ తరగతి పుస్తకం ఖరీదు ఇరవైరూపాయలట. పేపరుకు కూడా కరువు వచ్చిపడిందట. చూస్తూ చూస్తూ ఒకటవ తరగతి పుస్తకం ఇరవైరూపాయలిచ్చి కొనలేక పోయాను."

"ఇదెక్కడి విడ్డూరమండీ ? అయితే ఉన్న ఒక మగబిడ్డడిని చదువులేకుండా ఊరుమీద వదిలేద్దామా !" అంది.

"ప్చ్ ! ... నీకేం చెప్పినా అర్థంకాదు లక్ష్మీ ! ప్రతినెలా రెండుపూటలా భోజనం చేయడానికి నేనెంత జాగ్రత్తగా బడ్జెట్ తయారుచేసి డబ్బు ఖర్చు పెడుతున్నానో తెలుసా ! అయినా నెలాఖరు రోజుల్లో ఎంత ఇబ్బంది పడుతున్నాం ? ఈ నెల నిర్మల పురిటి ఖర్చులూ అవీ ఉన్నాయి. నా తల బ్రద్దలవుతుంది. వాడికా పుస్తకం అవసరం లేకుండా నేను వ్రాసి పెడతానులే ఎవరినన్నా పుస్తకం అడిగి" అన్నాడు రామారావు.

రచయితలకు మనవి

కథలు పంపేవారుకూడా విడిగా తపాలా బిళ్లలు పంపటం, లేదా కథ పంపిన కొంత కాలానికి తపాలా బిళ్లలు పంపటం చేయ వద్దని మనవి. కథల పరిశీలనకు ఆరు నుంచి పది వారాలు పట్టవచ్చును కథ ప్రచురణా మోదం పొందిన వెంటనే రచయితకు కార్డు ద్వారా తెలియజేస్తాము. నవలల విషయంలో ఏ విషయం తెలియటానికి నాలుగు మాసాలు పట్టవచ్చును. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదని మరోసారి మనవిచేస్తూ – మాతో రచయితలంతా పై నిబంధనల విషయంలో సహకరించాలని కోరుతున్నాము. కలర్ ట్రాన్స్‌పెరెన్సీలు పంపేవారు గూడా తిరుగు టపా కవరు పెట్టడం అవసరం. సం॥

నీతి సూరీడు

చలిమంచుతెరలవల్ల
అరుణోదయం ఆలశ్యం కావచ్చు,
చలిమంచు చినుకులవల్ల
బొందికి ఇంకాస్త ఇబ్బంది కావచ్చు,

కాని, నిశిరాత్రుల బేజారుతనాన్ని పోగొట్టి
మంచు చినుకులను గాలిలో కలుపుతూ,
గాలిలో చిరువెచ్చదనం నింపుతూ,
నిశిరాత్రుల బేజారుతనాన్ని బజారుపాలుచేసి,
శాకుంతల శ్రావ్యనాదాలతో కావ్యాలేవో వినిపిస్తూ,
మెల్లగానైనా వస్తాడు నీతి సూర్యుడు...
లేదు లేదు ఇంకా రాలేదు అని బేజారుపడకు,
రాదు రాదు ఇంక రాదు అని భయపడిపోకు...
అవినీతి అంధకారాలను ప్రతిఘటిస్తూ
అరుదుగానైనా వస్తాడు ఆలస్యమైనా వస్తాడు
వాడే నీతి సూరీడు...

— మల్లెపూడి మార్టిన్ లూథర్

కాలచక్రం

ఒక్క నిముషం మౌనం వహించి "అది సరే లెండి, అమ్మాయి పెళ్లి విషయం ఏం చేశారు ? మీ స్నేహితుని కొడుకు ఉన్నాడన్నారు" అంది లక్ష్మి.

"ఆ ... సుజాత పెళ్లి గురించే ఆలోచిస్తున్నాను. ఆఫీసునుంచి తిరిగి వచ్చేటప్పుడు అలా వాళ్లింటికి వెళ్తాను. కాస్త మంచినీళ్ళు తీసుకురా" అన్నాడు రామారావు.

* * *

"కూర్చో రామారావ్ !...నాకైతే స్నేహితుని కూతురిని కోడలిగా చేసుకోవాలని ఉంది. కాని ఈ కాలం పిల్లలు మన మాటకి విలువ ఎక్కడ ఇస్తున్నారు ? వాడు ... అదే మా అబ్బాయి శంకర్ అమ్మాయిని ఇష్టపడ్డాడు. కాని కట్నం విషయం అదీ వాడి ఇష్టప్రకారమే జరగాలట. వాడిని పిలుస్తాను. వాడితోనే మాట్లాడు" అన్నాడు రంగారావు.

"నమస్కారమండీ !" అని ఎదురు కుర్చీలో కూర్చున్నాడు శంకర్.

ప్రతి నమస్కారం చేశాడు రామారావు.

మాటల అనంతరం వంట్లో శక్తి లేనట్లు కాళ్ళీడ్చుకొంటూ రోడ్డుమీదకు వచ్చాడు రామారావు. ఈ సంబంధం కూడా ఇలా తప్పిపోయినందుకు ఇంటికి వెళ్లి లక్ష్మికేం చెప్పాలి అనే బాధ రామారావు మనస్సులో బయలుదేరింది... కొంచెం సేపయినా ప్రశాంతంగా ఎక్కడైనా గడపాలన్నట్లు దగ్గరలోనే ఉన్న పార్కులోనికి దారితీశాడు.

పార్కునిండా జనం కిటకిటలాడుతున్నారు. ఆ ప్రదేశమంతా వెచ్చని సెగలా ఉంది. ఎలాగూ దూరాను కదా అని ఎలాగైతేనేం అతికష్టంమీద చోటు సంపాదించి ఒక జంట ప్రక్కగా కూర్చున్నాడు.

"సురేష్ ! ఇన్నాళ్లు నువ్వు చూపించే ప్రేమంతా నటనా ? పెళ్లి విషయం ఎత్తేసరికి ఇలా మారిపోతావనుకోలేదు." అని ఇక మాట్లాడలేక కళ్ల నీరు నింపుకుంది ఆ అమ్మాయి.

"మై డియర్ స్వీట్ సుని. అఫ్‌కోర్సు నిన్ను ప్రేమించాను. కాదనడంలేదు. కాని నేను ఊరికినే పెళ్లాన్ని పోషించడానికి లక్షాధికారిని కాను. ఐ వాంట్ మనీ మై డియర్, అండర్‌స్టాండ్ ?"

ఇక వాళ్ల సంభాషణ వినే ఓపికలేక అక్కడ నుంచి లేచి ఇంటికి బయలుదేరాడు రామారావు.

"ఏమిటండీ ! అలా ఉన్నారు ? ... అయ్యో అలా ముఖం వేలాడేసుకొని వచ్చారేమిటి ? ఈ సంబంధం కూడా తప్పిపోయిందా ?" ఆత్రుతగా అడిగింది కుర్చీలో కూర్చుని అలసటగా కళ్లు మూసుకొన్న రామారావు వైపు చూసి లక్ష్మి.

"లక్ష్మీ ! ... చివరిసారిగా చెబుతున్నాను లక్ష్మీ ! నేను అసమర్థుడిని ! ... బాధ్యత తెలియకుండా పిల్లల్ని కన్నాను" అన్నాడు రెండు చేతుల మధ్య ముఖం దాచుకొని.

"ఏమండీ ! ఎందుకండీ అలా బాధపడుతున్నారు ! అసలేమయింది నాతో చెప్పండి. రంగారావుగారు పెద్దఆశలో లేరన్నారు కదండీ ?" అంది లక్ష్మి.

"అవును లక్ష్మీ ! రంగారావు పెద్దఆశలో లేడు. కాని వాడి కొడుకు ఉన్నాడు. వాడు సంపాదించేది వెయ్యిరూపాయల జీతం. కాని కట్నం లక్షరూపాయలు కావాలట. అంత ఇచ్చుకోలేనంటే 'ఈ రోజుల్లో ఒక మనిషిని పోషించడం అంటే మాటలనుకున్నారా ?' అన్నాడు. నిత్యావసర వస్తువులే కాదు. కట్నాలు కూడా బాగా పెరిగిపోయాయి. నేను ఈ బాధ్యతలు మోయలేను ! అమ్మాయి పెళ్లి చేయలేను. అసమర్థుడిని ... అసమర్థుడిని" అని బలంగా జుట్టు పీక్కోసాగాడు రామారావు.

* * *

"ఏమండోయ్ ! ఏమిటండీ పట్టపగలే కలవరింతలు ? మీకేం చక్కగా నిదుర పోతారు. నాకు తప్పుతుందా ? ప్రక్కింటి ఆమె నడిగి బొగ్గులు తెచ్చి వంట చేశాను. వడ్డిస్తాను రండి" అని వచ్చినంత వేగంగా వంటింట్లోకి వెళ్లిపోయింది లక్ష్మి.

"ఏమిటి ! ఇంతవరకు తను కల కన్నాడా ? పేపరు చూస్తుంటే 'ముప్పై ఏళ్లలో ప్రపంచమంతటా చమురు నిల్వలు అయిపోతాయి' అని చదివిన వార్త తనలో ఎన్నో ఆలోచనలు బయల్దేరదీసింది ! దాని ప్రభావం ఇప్పుడే చూపిస్తోందా కిరసనాయిల్ కూడా దొరకడంలేదు అనుకొన్నాడు చమురు నిల్వలు అయిపోతే ఒక్క కిరసనాయిలేకాదు పెట్రోలు, ఎరువులు మొదలైనవన్నీ అయిపోయినట్లే కదా. అప్పుడు మన పరిస్థితి ఎలా ఉంటుందన్న ఆలోచనలతో మగతగా నిదుర పట్టిన తన ఎంత విచిత్రమైన కల వచ్చింది ! ఇది కల అయినా నిజం కావడానికి ఎన్నాళ్ళో లేదు కూడా" అనుకుంటూ వంటింట్లోకి దారితీశాడు రామారావు.